# నిజాయితీకి నిలువుటద్దం హన్మంతు కృష్ణయ్య

## జాతీయ సమితి సభ్యులు బాగం

ప్రజా వీక్షణం/ ఖమ్మం

ఖమ్మం :- నిజాయితీకి నిలువుటద్దం హన్మంతు కృష్ణయ్య అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు హన్మంతు కృష్ణయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.కామాంచికల్ లో ఆయన 21వ వర్ధంతి సభకు హాజరై నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హన్మంతు కృష్ణయ్య మరణం పార్టీకి తీరని లోటని కామాంచికల్ గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ రాము తదితరులు ఉన్నారు



# ఆకాశంలో నెలవంక దర్శనం..

## రేపటి నుంచే రంజాన్

## 31 ఏళ్ల తర్వాత ఫిబ్రవరిలో ప్రారంభం

ప్రజా వీక్షణం /ఖమ్మం

ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఫిబ్రవరి 18 నుంచి ప్రారంభం కానుంది. నెలవంక కనిపించినట్లు మతపెద్దలు తెలిపారు. రంజాన్ మాసం దాదాపు 31 ఏళ్ల తర్వాత ఫిబ్రవరిలో ప్రారంభం కాబోతోంది. గతంలో 1995 ఫిబ్రవరి 1వ తేదీన రంజాన్ మాసం మొదలైంది. తరువాత ఇప్పుడే మళ్లీ ఫిబ్రవరిలో రంజాన్ మాసం ప్రారంభం కావడం ఈ సారి విశేషం. మరోవైపు ముస్లిం సోదర, సోదరిలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు, ప్రార్ధనలు, ఖురాన్ పఠనంతో రంజాన్ మాసంలో గడుపుతారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్ర పండుగా భావించే రంజాన్ మాసం రేపటి నుంచి ప్రారంభం కానుంది. నెలవంక దర్శనమి వ్వడంతో రేపటి నుంచి అధికారికంగా రంజాన్ మాసం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. ఇక రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపవాసాలు పాటించే ఉద్యోగుల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటలకే విధులు ముగించుకునేలా అనుమతి ఇచ్చింది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ఈ మేరకు ప్రత్యేకమైన వెసులుబాటు కల్పించింది. తాజా నిర్ణయంతో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 20 వరకు ముస్లిం ఉద్యోగులు తమ విధులను సాయంత్రం 4 గంటలకే ముగించుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంపై ముస్లిం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



# ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తుతో బోర్డు చెలగాటం: ఎఐవైఎఫ్ ఆగ్రహం

ప్రజా వీక్షణం, హైదరాబాద్ :

ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్ష ఫీజులు, హాల్ టికెట్ల జారీలో బోర్డు కార్యదర్శి ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్ బోర్డు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సుమారు ఐదు గంటల పాటు కార్యాలయం ఆవరణలో బైఠాయించి బోర్డు అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బోర్డు నిర్లక్ష్యం వల్ల సుమారు 300 మందికి పైగా విద్యార్థులు హాల్ టికెట్లు అందక ఆందోళనలో ఉన్నారని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, యాజమాన్యాల సంఘం నేతలు గౌరి సతీష్, విష్ణువర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నికల్ సమస్యలు , ఇతర కారణాలతో ఫీజు చెల్లించలేకపోయిన విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించి పరీక్షలు రాసేలా చూడాలని డిమాండ్ చేశారు.ఈ నెల 25 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు ఏడాది కోల్పోయి సప్లిమెంటరీ రాయాల్సి వస్తుందని, ఇది వారి కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నేతలు నెర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్, సల్మాన్, కళ్యాణ్ తదితరులు పాల్గొని బోర్డు కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు..



# క్రీడల్లో మర్యాల విద్యార్థుల ప్రభంజనం..

## రాష్ట్ర స్థాయికి ఎంపిక..

ప్రజా వీక్షణం, బొమ్మలరామారం:



కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే సామెతను నిజం చేస్తూ, మారుమూల గ్రామానికి చెందిన మర్యాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు క్రీడారంగంలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2025 (సెకండ్ ఎడిషన్) పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.బాలుర మరియు బాలికల విభాగాల్లో మర్యాల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో టీం ఛాంపియన్ షిప్‌తో పాటు, బాలుర విభాగంలోనూ ప్రథమ స్థానాన్ని సాధించి, ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నారు. బాలికల ఖో-ఖోలో వేదశ్రీ, శ్రావణి, ప్రవళిక, జస్మిత, రవళి, హరిష్మా, శ్రేష్ఠ, చరణ్య, హారిక, బాలుర ఖో-ఖోలో నరేష్, గోవింద్ సింగ్, తిరుపతి, సన్నీ, భవేష్, చరణ్, మణికంఠ, విష్ణువర్ధన్, అరుణ్.అథ్లెటిక్స్ లో హరిష్మా, నిహారిక, అక్షయ, దేవేందర్ లు ఉన్నారు.

### గురువు శిక్షణ.. విద్యార్థుల పట్టుదల ...

ఈ విజయాల వెనుక ఫిజికల్ డైరెక్టర్ కోనేటి గోపాల్ కృషి ఎంతో ఉంది. విద్యార్థులను తన స్వంత బిడ్డల్లా భావిస్తూ, చదువుకు ఆటంకం కలగకుండా జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్న ఆయనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లోనూ మర్యాల విద్యార్థులు అబ్బురపరిచే ప్రదర్శన ఇచ్చారు. ఈ నెల 20 నుండి 23 వరకు నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లోనూ, హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లోనూ వీరు పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం పగిడిపల్లి నిర్మల జ్యోతి తెలిపారు. విద్యార్థుల ప్రతిభను చూసి సర్పంచ్ సంగి గణేష్ , గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.




# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జలమండలి ఏండీకి వినతి...

ప్రజా వీక్షణం, హైదరాబాద్:

గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ బిఆర్ఎస్ నాయకుడు ఆనంద్ గౌడ్ బుధవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకలగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తాగునీరు , డ్రైనేజీ సమస్యలపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. ఎండాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఎక్కడా నీటి ఎద్దడి కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా గత ఏడాది పిల్లీ బౌలి ప్రాంతంలో ఎదురైన ఇబ్బందులను గుర్తు చేస్తూ, ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.నియోజకవర్గంలో పాడైన బోరుబావులను తక్షణమే మరమ్మతు చేయించాలని ఎండికి విన్నవించారు. లక్షలాది రూపాయల నీటి బిల్లుల బకాయిలు ఉన్న పేద ప్రజల కోసం 'ఓటిఎస్' పథకాన్ని అమలు చేయాలని, ఇంట్రెస్ట్ వేవ్ చేస్తే అధికారులు ఇంటింటికీ తిరిగి బిల్లులు కట్టించేలా తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, పై అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల ఎండి చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ మైనారిటీ ప్రెసిడెంట్ హైమద్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానించిన పద్మశాలి సంఘం..

ప్రజా వీక్షణం, జహీరాబాద్:



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను జహీరాబాద్ పద్మశాలి సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి భవన్‌కు విచ్చేసిన మంత్రిని సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ , కార్యవర్గ సభ్యులు శాలువాకప్పి, బొకేలతో గౌరవించారు . ఈ సన్మాన కార్యక్రమంలో లక్కీ మధు, ఎన్నం రఘు, శివరాం రమేశ్, ఇంజమూరి మల్లేశం, గద్దె వెంకటేశం, దోమల పండరి, సగ్గం శ్రీనివాస్, గుజ్జరిరాందాస్, గాజుల రామలింగం, జెట్ల శివకుమార్, బిజ్జ నిజానంద్, మరెల్లి వెంకటయ్య, నామాల సునీల్, నీలి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు , ఆస్పత్రుల అభివృద్ధిపై మంత్రి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



# యువత క్రీడల వైపు మళ్లాలి

## - నెమలి అనిల్ కుమార్

## చాందిని క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవం

## - విజేతగా నిలిచిన ధన టీమ్

ప్రజా వీక్షణం, మల్లాపూర్ :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చాందిని క్రికెట్ టోర్నమెంట్' బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ బండ భావి కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని, ఈ కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని నిర్వాహకులను అభినందించారు . పోటీల్లో ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా నిలిచిన 'ధన టీమ్' కు రూ.25వేల నగదు బహుమతిని, రన్నర్స్‌గా నిలిచిన 'కుషాయిగూడ బాయ్స్' రూ15వేల ప్రైజ్ మనీని అనిల్ కుమార్ అందజేసి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కోయలకొండ రాజేష్, నాగి ముదిరాజ్, శివ ముదిరాజ్, రాజు ముదిరాజ్, బాబ్లు, సందీప్, వంశీ తదితరులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడంలో నెమలి అనిల్ కుమార్ అందిస్తున్న ప్రోత్సాహం పట్ల నిర్వాహక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..




# మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## - రాష్ట్ర మంత్రులుమేడ్చల్ జిల్లాలో రూ. 1.12 కోట్ల చెక్కులు, వాహనాల పంపిణీ.... 'ఇందిరమ్మ మహిళా యోజన'తో మహిళా సాధికారత..



ప్రజా వీక్షణం, మేడ్చల్ జిల్లా ప్రతినిధి :

రాష్ట్రంలోని మైనారిటీల అభ్యున్నతి , సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ,ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని మైనారిటీ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం , వాహనాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్, గురుకుల పాఠశాల చైర్మన్ ఫయిమ్, ఎమ్మెల్సీలు ఇంఫెండీ, మీర్జా రహమత్ బేగ్, సెక్రటరీ షఫీఉల్లా, డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నిరుపేద మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధి కోసం రూ. 50వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. జిల్లాలో 232 మందిని లక్ష్యంగా పెట్టుకోగా, ఎంపిక చేసిన 225 మందిలో ప్రాథమికంగా 5 మందికి రూ. 1,12,50,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.రేవంత్ అన్న భరోసా పథకం: మైనారిటీ యువతకు రవాణా రంగంలో ఉపాధి కల్పించేందుకు లక్ష రూపాయల విలువైన బైక్‌లను పంపిణీ చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, ప్రస్తుతం 13 మందికి వాహనాలను అందజేశారు. మైనారిటీల అభివృద్ధి కోసం మంత్రి అజారుద్దీన్, సలహాదారు షబ్బీర్ అలీ చేస్తున్న కృషితో మైనారిటీ వర్గాల్లో కొత్త భరోసా కనిపిస్తోందని మహేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు.

